క్లుప్తంగా

రేపు కంటి వైద్య శిబిరం

దొనకొండ: జిల్లా అంధత్వ నివారణ సంస్థ స్థానిక సాయి విజ్ఞాన హైస్కూల్లో ఆదివారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బొరిగొర్ల ఉష తెలిపారు. శంకర కంటి ఆస్పత్రి పెదకాకాని వైద్యులు పిల్లలకు, పెద్దలకు, వృద్ధులకు ఉచిత కంటి పరీక్షలు చేయనున్నారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆయుష్మాన్ భారత్ పథకాన్ని వినియోగించుకోవాలి

పెద్దారవీడు: దేశంలోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గుడ్డెపోగు రమేష్ అన్నారు. మండలంలో సుంకేసుల సచివాలయంలో ఆయుష్మాన్ భారత్ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కార్డులు లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి ఆర్.పెద్దిరాజు మాట్లాడుతూ గ్రామంలో 3842 మందికి గానూ 2552 మందికి కార్డులు వచ్చాయని పేర్కొన్నారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

బేస్తవారిపేట: మండలంలోని బసినేపల్లె సచివాలయ పరిధిలో ఖాళీగా ఉన్న రెండు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ టి.పార్వతి తెలిపారు. ఓసీ జనరల్, బీసీ మహిళ వలంటీర్ల పోస్టులకు పదో తరగతి పాసై, 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. 22న ఇంటర్వ్యూలు, 23న నియామక పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కలిగిస్తున్న ఎంవీఐ రవికుమార్

దర్శి: ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా శుక్రవారం ఆటో డ్రైవర్లకు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పి.రవికుమార్ అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపరాదని, అలా చేసిన వారికి జైలుశిక్ష, జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, బస్సు పాయింట్ల వద్ద ఆటోలు నిలపరాదని, వాహనాలకు సంబంధించిన ఇన్సూరెన్సు, ఫిట్నెస్, రిజిస్ట్రేషన్ పత్రాలను తప్పనిసరిగా బండిలో ఉంచుకోవాలన్నారు. పరిమితికి మించి వాహనాల్లో ప్యాసింజర్లను ఎక్కించుకోరాదని సూచించారు.

మహిళా సాధికారతే లక్ష్యం



కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హర్షిత

మార్కాపురం టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు టైలరింగ్ ఉపయోగపడుతుందని వైఎస్సార్ సీపీ 16వ వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షిత పేర్కొన్నారు. డెవలప్‌మెంట్ సోషల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో మహిళల కోసం అరుణోదయ స్కూల్ సమీపంలో ఉచితంగా ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఉచిత శిక్షణ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ అధ్యక్షుడు ఏలూరి పీఠాధిపతులు బిషప్ పొలిమేర జయరావు, ప్రకాశం సూచించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ఎస్ డైరెక్టర్ ఫాదర్ థామస్ జార్జి, సెక్రటరీ పీసీ ప్రసాద్, కోఆర్డినేటర్ రూన్సీరాణి, సుజాత తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు కౌన్సిలర్ హర్షితను సన్మానించారు.

కెరీర్ గైడెన్స్‌ను వినియోగించుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న రామ్‌భూపాల్‌రెడ్డి

అర్థవీడు (కంభం): విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మార్గదర్శిని జిల్లా పర్యవేక్షకుడు ఎం.రామ్‌భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కేజీబీవీల్లో 9, 10, ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు పదో తరగతి నుంచే ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని సమయాన్ని వృథా చేయకుండా నిరంతరం శ్రమిస్తే విజయాలు చేరుకోవడం సులభతరమవుతుందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లో మోటివేషనల్ కార్యక్రమాలు అమలు చేయడం విద్యార్థులకు సువర్ణవకాశమని తెలిపారు. గురుకుల ప్రిన్సిపాల్ బి.బలరామిరెడ్డి, ఎంఈఓలు సత్తార్, లక్ష్మీనాయక్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మేశ్వరరెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారి వై.మాలతి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ నవజీవన్ రెడ్డి, మెంటర్స్ వంశీకృష్ణ, జయలక్ష్మి, సుందరి, సలీంబాషా పాల్గొన్నారు.



కొత్తరెడ్డిపాలెం పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా నాగుల చవితి వేడుకలు



నాగమయ్యకు పూజలు చేస్తున్న భక్తులు

పొదిలి రూరల్:

పొదిలి నగర పంచాయతీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. పొదిలి నిర్మమహేశ్వర దేవస్థానం, పోతవరం, ఉప్పలపాడు, మూగచింతల గ్రామాల్లో పుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించారు.

కొనకనమిట్ల: నాగులచవితి సందర్భంగా మండలంలోని పెదారికట్ల, ఎదురాళ్లపాడు, కొనకనమిట్ల, గొట్లగట్టు, చినారికట్ల, బ్రాహ్మణపల్లి, సలనూతల, అంబాపురం గ్రామాల్లో మహిళలు పుట్టలో పాలు పోసి నాగేంద్రుడికి పూజలు చేశారు. చలివిడి, వడపప్పుతో నైవేద్యం సమర్పించారు.

నాగులు చవితికి ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: నాగుల చవితి సందర్భంగా మహిళలు పుట్ట వద్ద పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలో నాగుల చవితిని పురస్కరించుకుని మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో పుట్టల వద్దకు చేరుకుని పూజలు చేయడం కనిపించింది. తెల్లవారు జాము నుంచి భక్తులు కార్తీక స్నానాలు చేసి భక్తిశ్రద్ధలతో నాగులు చవితిని జరుపుకున్నారు. త్రిపురాంతకం ఆలయాల సమీపంలో ఉన్న పుట్టల వద్ద భక్తులు ఎక్కువగా పూజలు చేశారు.

దర్శి: నాగుల చవితి వేడుకలు శుక్రవారం ఘనంగా న్విహించారు. నాగేంద్రస్వామి పుట్టకు పాలుపోసి కోడిగుడ్లు, చలిపిండి ప్రసాదాలు పంపిణీ చేశారు. స్వామివారి పుట్టచుట్టూ వార్లు పోసి దీపాలు వెలిగించి పసుపు కుంకుమలతో మహిళా భక్తులు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. నాగుల చవితి పండగ సందర్భంగా కొత్తరెడ్డిపాలెం వద్ద డున్న నాగేంద్రస్వామి పుట్ట, పుట్ట బజారు పుట్ట వద్ద, ఎస్ఎస్‌సీ కాలనీ వద్ద పుట్టలకు భక్తుల తాకిడి పెరిగింది.

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో భక్తులు నాగుల చవితి వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో వెలసిన నాగేంద్ర స్వామికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శత నామావళి, విశేష పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు భైరవానంద స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కురిచేడు: నాగుల చవితి పర్వదినం సందర్భంగా భక్తులు శుక్రవారం వేకువ జాము నుంచి పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేసేందుకు బారులు తీరారు. ఉపవాసదీక్ష తీసుకున్నారు. పుట్టలకు నీరుపోసి అనంతరం పూజలు చేశారు. పుట్టలో స్వామికి పాలు, పండ్లు, చలివిడి, నానుబాలు, నువ్వుల పిండి సమర్పించారు. అనంతరం ఒక్కరోజు పూర్తిగా ఉపవాస దీక్ష చేపట్టారు. మహిళలు పెద్ద సంఖ్యలో పుట్టల వద్ద పూజలు చేశారు. స్థానిక శ్రీ జ్ఞానప్రసూనాంబసమేత శ్రీ కాళహస్తీశ్వరస్వామి ఆలయంలో ఉన్న నాగపడిగలకు పూజలు చేశారు.

ఓటర్ల నమోదును బాధ్యతగా నిర్వర్తించాలి

- జేసీ శ్రీనివాసులు
- కంభంలో ఆరు మండలాల అధికారులతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

కంభం: ఓటర్ల నమోదులో అవకతవకలు లేకుండా చూసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె. శ్రీనివాసులు అన్నారు. స్థానిక యూబీ ఫంక్షన్ హాలులో శుక్రవారం సాయంత్రం నియోజకవర్గంలో ఆరు మండలాల తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీ రేషియో, జండర్ రేషియో, అనామలిస్ రిపోర్టుల్లో 80 సంవత్సరాలకు పైబడిన ఓటర్లను, ఒకే ఇంటి నంబర్‌తో 10 కంటే ఎక్కువగా నమోదైన ఓటర్లు, ఇంటి నంబర్ సున్నా నమోదైన ఓటర్ల వివరాలు, ఫొటో మార్పులు, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. పనితీరు సక్రమంగా లేని పలువురు బీఎల్‌ఓలు, అధికారులపై జాయింట్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది వారికి కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ఈఆర్వో, డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, తహసీల్దార్‌లు శైలేంద్రనాథ్, వరకుమార్, బి.రమాదేవి, అత్తార్ నాయబ్ హుస్సేన్, దిలీప్‌కుమార్, సీతారామయ్య పాల్గొన్నారు.

కార్గో సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలి

- ఆర్టీసీ డీఎం నరసింహులు



కార్గో సేవలపై మాట్లాడుతున్న డీఎం నరసింహులు

మార్కాపురం: ప్రజలు ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను ఉపయోగించుకోవాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. కార్గో మాసోత్సవాల సందర్భంగా ప్రజలకు సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. డీఎం మాట్లాడుతూ.. పార్శిల్ కౌంటర్ నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో 50 కిలోల బరువు వరకు బుకింగ్ చేసిన వారికి డోర్ డెలివరీ సౌకర్యం ఉందన్నారు. వినియోగదారులు తమ పార్సిల్ వివరాలు తెలుసుకునేందుకు ట్రాకింగ్ సిస్టమ్ కూడా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏటీఎం కమర్షియల్ మేనేజర్ కేజే నవీన్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ కామేశ్వరి, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎం.భాస్కర్‌రావు, ఎంఎఫ్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో మెరిసిన జెడ్పీ విద్యార్థులు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తర్లుపాడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం మండల స్థాయిలో ఏర్పాటు చేసిన క్విజ్ పోటీల్లో చెన్నారెడ్డిపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారని లైబ్రేరియన్ పీవీ సుబ్బారెడ్డి తెలిపారు. తర్లుపాడు, మీర్జపేట హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ద్వితీయ స్థానం, స్థానిక లూథరన్ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు పోటీలకు హాజరైనట్లు చెన్నారెడ్డిపల్లి జెడ్పీ ఆంగ్ల ఉపాధ్యాయుడు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.కోటిమోహన్ తెలిపారు. ఉపాధ్యాయులు బ్రహ్మానందం, నేతాజీ తదితరులు పర్యవేక్షించారు.

పెద్దారవీడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి పుస్తకాలు చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కవితలు, పద్యాలు చెప్పించారు. హెచ్ఎం కనకదుర్గ, ఉపాధ్యాయులు, 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రాచర్ల: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మండలంలోని ఆకవీడు, రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సీనియర్ విభాగంలో విద్యార్థినులు, విద్యార్థులకు గ్రంథపాలకులు శ్రీధర్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు అధ్వర్యంలో చిత్రలేఖనం, చదరంగం పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనం, చదరంగం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 20వ తేదీని గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు రోజు బహుమతులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

రివాల్వింగ్ గేటు బహూకరణ



గేటు ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ సభ్యులు

కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని పరిశుభ్రంగా ఉంచే ప్రక్రియలో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేర్లి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పేర్లి గుండయ్య రూ. 10 వేల వ్యయంతో రివాల్వింగ్ గేటును శుక్రవారం ఉదయం ఏర్పాటు చేశారు. మార్నింగ్ వాక్‌కు వెళ్లే ప్రజలు పడుతున్న సమస్యను దృష్టిలో ఉంచుకొని ఈ గేటును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు మొఘల్ మహబూబ్ బేగ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, సీనియర్ సభ్యులు హుస్సేన్ బేగ్, పులి శ్రీనివాస ప్రసాద్, గుండయ్య, కళాశాల పీడీ మురళీ కృష్ణ, హైస్కూల్ పీడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు



పతాకావిష్కరణ చేసి మాట్లాడుతున్న చైర్మన్ చెన్నారెడ్డి

దర్శి: అఖిల భారత సహకార వారోత్సవాలు శుక్రవారం పీఏసీఎస్‌లో ఘనంగా నిర్వహించారు. సంఘం ఛైర్మన్ వేమిరెడ్డి చెన్నారెడ్డి పతాకావిష్కరణ చేశారు. బ్యాంకు సిబ్బంది సహకారంతో జిల్లాలోనే మొట్టమొదటి పెట్రోలు బంకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమష్టి కృషితో సంఘాన్ని లాభాలబాట పట్టించినట్లు చెన్నారెడ్డి తెలిపారు. కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షేక్ జిలానిబాషా మాట్లాడుతూ మూడేళ్లుగా ప్రతి అంశం పూర్తి అవగాహనతో, కార్యాచరణతో చేస్తున్నట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ బీసీ మాలకొండయ్య మాట్లాడుతూ సహకార రంగం ఉజ్వలంగా ముందుకు సాగుతోందన్నారు.70 సహకార వారత్సవాల ముఖ్య ఉద్దేశాన్ని డీసీఓ రాజశేఖర్ వివరించారు. డైరెక్టర్‌లు పూసల చిన్నయ్య, ముప్పరాజు సుబ్బారావు పాల్గొన్నారు.

దేశంలో రాజ్యాంగ వ్యతిరేక పాలన

మార్కాపురం: దేశంలో రాజ్యాంగ వ్యతిరేక పాలన కొనసాగుతోందని, మోడీ విధానాలకు వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని సంరక్షించేందుకు ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ శిరివెళ్ల ప్రసాద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్, రైల్వే, పౌర విమానయాన శాఖ, పోస్టల్, హిందుస్థాన్ పెట్రో కెమికల్స్‌తోపాటు ప్రధాన నౌకాశ్రయాలను బీజేపీ ప్రభుత్వం అతిచవకగా అదానీతోపాటు బహుళ జాతి సంస్థలకు విక్రయిస్తోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని, పశ్చిమ ప్రకాశంలోని అన్ని మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త సయ్యద్ జావీద్ అన్వర్, గాలి వెంకటరామిరెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం

మద్దిపాడు: మండలంలోని మల్లవరం ఎస్సీకాలనీలో విద్యుదాఘాతంతో గాయాలపాలైన వ్యక్తికి జగనన్న ఫౌండేషన్ చైర్మన్ వారా వీర్రాజు శుక్రవారం ఆర్థికసాయం చేశారు. దాసరి అంజయ్య అనే వ్యక్తి వ్యవసాయ పనులు చేస్తూ పొలంలో కరెంటు స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న జగనన్న ఫౌండేషన్ చైర్మన్ వారా వీర్రాజు శుక్రవారం మల్లవరంలోని అంజయ్య ఇంటికి చేరుకుని పరామర్శించారు. జగనన్న ఫౌండేషన్ ద్వారా ఆ కుటుంబానికి ఆర్థికసాయం చేసి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం ఎండ్లూరు గ్రామానికి చెందిన కసుకుర్తి శ్రీను మూత్రపిండ వ్యాధితో మృతి చెందడంతో ఆయన భార్య సునీతకు స్థానిక సర్పంచ్ ఎస్.పుల్లయ్య చేతుల మీదుగా వైఎస్సార్ బీమా నగదులో తొలి విడత మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను శుక్రవారం అందించారు. మిగిలిన నగదును త్వరలో అందిస్తామన్నారు. మృతుని కుటుంబానికి వైఎస్సార్ సీపీ తరఫున అండగా ఉంటామని సర్పంచ్, స్థానిక నాయకులు భరోసా ఇచ్చారు.

మంత్రి సురేష్‌ను సన్మానించిన ఎంపీపీ



మంత్రి సురేష్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ వెంకటయ్య, ప్రజాప్రతినిధులు

పుల్లలచెరువు: రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను ఎంపీపీగా నూతనంగా ఎన్నికైన కందుల వెంకటయ్య గురువారం యర్రగొండపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ తనకు ఎంపీపీగా అవకాశం ఇచ్చినందుకు ఎప్పుడూ మంత్రి సురేష్‌కు, పార్టీకి రుణపడి ఉంటానన్నారు. వెంకటయ్యతో పాటు మండల కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రాములు, సర్పంచ్‌లు కోటిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, జ్యోతి, యండ్రపల్లిస్వామి, ప్రజాప్రతినిధులు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, పోలిరెడ్డి పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులకు బూచేపల్లి సొంత నిధులు



రూ.5 లక్షలతో రోడ్డుకు చేసిన మరమ్మతులు



గతంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని తూర్పు గంగవరం–దారంవారిపాలెం గ్రామాల మధ్య గోతులతో బురదమయంగా మారిన రహదారికి బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఐదు లక్షల రూపాయల సొంత నిధులతో మరమ్మతు పనులు పూర్తి చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా గ్రామాల మధ్య రహదారి బురదమయంగా మారి వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారటంతో సమస్యను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, మన్నేపల్లి సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డిలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య వివరించారు. తక్షణం స్పందించి ఐదు లక్షల రూపాయల నిధులు ఇచ్చి రెండు రోజుల్లో మరమ్మత్తు పనులు పూర్తి చేయించారు. దీంతో వాహన రాకపోకలకు మార్గం సుగమం అయింది. ప్రజా సమస్యలకు స్పందించి మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించినందుకు ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

అన్నదానం మహాదానం



అన్నదానం ప్రారంభిస్తున్న కృష్ణమోహన్‌రెడ్డి

మార్కాపురం: ప్రస్తుత పరిస్థితుల్లో అన్నదానం మహాదానమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు మాజీ వైస్ ఎంపీపీ కుందురు కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో రెండో రోజు అయప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏటా వేలాది మంది అయ్యప్ప దీక్ష తీసుకున్న భక్తులకు సుమారు నెలరోజులపాటు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరికీ దేవునిదయ ఉండాలని ఆకాంక్షించారు. వచ్చేనెల 10వ తేదీన ఆలయంలో సేవా సంఘం ఆధ్వర్యంలో విళక్కు ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు టి.గోపాల మల్లికార్జున రావు, కార్యదర్శి పదుచూరి కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సరస్వతీ దేవి విగ్రహం ఆవిష్కరణ



పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహం

పొదిలి రూరల్: మండలంలోని ఓబులక్కపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ ఆవుల వెంకట సుబ్బారెడ్డి దంపతులు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంఈఓ మామిళ్లపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. చదువులతల్లి సరస్వతీదేవి విగ్రహం పాఠశాలలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మరి కొంత మంది దాతలు సహకరిస్తే పాఠశాల మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 పేరం నాగలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మి, హెచ్ఎం సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరెడ్డి, పిల్లి రమణారెడ్డి, గాదె వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సంతోష్‌కుమార్‌ను సన్మానించిన వ్యాపారులు



సంతోష్‌కుమార్‌ను సన్మానిస్తున్న వ్యాపారులు

త్రిపురాంతకం: యర్రగొండపాలెం మార్కెట్‌యార్డు డైరెక్టర్‌గా నియమితులైన దోగిపర్తి సంతోష్‌కుమార్‌ను వ్యాపారులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. త్రిపురాంతకంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో సన్మాన కార్యక్రమం జరిగింది. నూతన కమిటీలో సంతోష్‌కుమార్‌కు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అవకాశం కల్పించింది. దాంతో వ్యాపార వర్గాలకు సముచిత స్థానం కల్పించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సంతోష్‌కుమార్‌ను దుశ్శాలువలు, పూలమాలలతో సన్మానించారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

ముండ్లమూరు: తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నామని దర్శి నియోజకవర్గ ఎన్నికల అధికారి లోకేశ్వరరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం బీఎల్‌ఓలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాలో పొరపాట్లు ఉంటే సంబంధిత ఏఈఆర్‌ఓ, ఈఆర్‌ఓ, బీఎల్‌ఓలు లేదా నియోజకవర్గ ఎన్నికల అధికారికి సంబంధిత ఫారంతో డిసెంబర్ 9 లోపు అందజేయాలని ఆయన సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని పేర్కొన్నారు. చనిపోయిన లేదా శాశ్వతంగా వేరే ప్రదేశానికి మారిన వారి ఓట్లు తొలగించడానికి ప్రత్యేక ఫారాలు విడివిడిగా ఇవ్వాలని కోరారు. దర్శి తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంటు శేషగిరిరావు పాల్గొన్నారు.